భారీ వర్షం.. వీధులు జలమయం

- సాయంత్రానికీ తగ్గుముఖం పట్టని వరద
- నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయం

కడప కార్పొరేషన్: కడప నగరంలో ఆదివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. పెద్ద ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. నగర నడిబొడ్డున ఆర్టీసీ బస్టాండు, తేజ పెట్రోల్ బంకు నుంచి వై జంక్షన్ మీదుగా మినీ బైపాస్ రహదారులపై భారీ స్థాయిలో వరద నీరు నిలిచింది. ఫక్కీరుపల్లెకు పోయే మార్గం నుంచి మినీ బైపాస్ మొత్తం నీటితో నిండిపోవడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

వినాయక నగర్ కూడలిలో పెద్ద మొత్తంలో వర్షపునీరు నిలిచింది.నగరంలోని మురికి కాలువలు, వరద నీటి కాలువలు పొంగి ప్రవహించాయి. ఎస్‌బీఐ కాలనీ, గంజికుంట కాలనీ, ప్రకాష్‌నగర్, గోకుల్ సర్కిల్, గౌస్ నగర్, అక్కాయపల్లె, నంద్యాల నాగిరెడ్డి కాలనీ, రామరాజుపల్లె తదితర ప్రాంతాలు



ఎస్‌బీఐ కాలనీలో నీట మునిగిన రోడ్లు, ఇళ్లు

జలమయమయ్యాయి. కూరగాయల మార్కెట్‌లో నీరు, బురద నిలవడంతో వినియోగదారులు, వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. ఉరుములతో కూడిన గాలులు వీచడంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఇళ్లలోకి నీరు



ఆర్టీసీ బస్టాండు వద్ద వర్షపు నీటిలో వెళుతున్న వాహనదారులు

కడప ఎడ్యుకేషన్: కడప హౌసింగ్ బోర్డు కాలనీ సోనోవిజన్ షోరూంకు ఎదురుగా ఉన్న వీధుల్లో చిన్నపాటి వర్షానికే నీరంతా నిలిచి వంకను తలపిస్తోంది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక నీరు నిలవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షాలకు వీధిలోని కొన్ని ఇళ్లలోకి నీరు చేరినట్లు స్థానికులు తెలిపారు. ఇటీవల అభివృద్ధి పనులు చేపట్టడంతో డ్రైనేజీ కాలువ రోడ్డుకంటే ఎత్తులో ఉండిపోయిందని, దీంతో రోడ్డుపైనే నీరు నిలిచి దోమల బెడద అధికమైందని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



చిన్నచౌకు ప్రధాన రహదారిపై వర్షపు నీరు



రాజీవ్ పార్కు సమీపంలో విద్యుద్దీపాల మధ్య వర్షపు జల్లులు



ఆదివారం కురిసిన వర్షానికి నగరంలో నిలిచిన వర్షపు నీరు

క్లుప్తంగా

వినాయక నిమజ్జనం



నిమజ్జనానికి తరలుతున్న గణేశుడు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప నగర శివారులోని ఊటుకూరు గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఏడు రోజులపాటు విశేష పూజలు నిర్వహించిన నిర్వాహకులు ఆదివారం భక్తులకు అన్నదానం చేశారు. స్వామి లడ్డూను స్థానికుడు అల్తాఫ్ రూ.1.20 లక్షలకు దక్కించుకోగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. యువకులు, పిల్లలు ఒకరినొకరు రంగులు చల్లుకుంటూ గణపతి బొప్పా మోరియా అంటూ ఊరేగింపులో పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు రాజగోపాల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, కొండయ్య, శివశంకర్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డిలు పర్యవేక్షించారు.

గంగమ్మ ఆలయంలో పూజలు



ప్రసాదాలు స్వీకరిస్తున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: చింతకొమ్మదిన్నె మండలంలో వెలసిన గంగమ్మ ఆలయంలో మేయర్ సురేష్‌బాబు, ఆయన తనయుడు అమరేష్ బాబు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయన పీఏ మేనల్లుడి కేశఖండన మహోత్సవంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యల్లారెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మహబూబ్‌అలీ

కడప ఎడ్యుకేషన్: కడప మెడికేర్ హాస్పిటల్‌లో డాక్టర్ మహబూబ్ అలీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. రోగులకు రూ.3 వేల రుపాయల విలువగల షుగర్, కొలెస్ట్రాల్, న్యూరోపతి, ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేసి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ మహబూబ్ అలీ మాట్లాడుతూ మధుమేహ వ్యాధి నియంత్రణకు సమతుల్యఆహారం అవసరం అన్నారు. పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, తక్కువ కొవ్వు పదార్థాలు, కార్బొహైడ్రేట్‌లతో మితమైన ఆహారం తీసుకుంటే రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియత్రిస్తాయన్నారు. ఈ శిబిరంలో మెడికల్ రెప్స్‌తోపాటు మెడికేర్ ఆసుపత్రి సిబ్బంది గౌతమి, బార్గవి, శిరీషరెడ్డి, సువర్ణ, మౌలాని, షాహిద్ పాల్గొన్నారు.

గర్భిణులకు రొట్టెల పంపిణీ



రొట్టెలు అందజేస్తున్న జేవీవీ ప్రతినిధులు

కడప కల్చరల్ : ప్రముఖ సాహితీవేత్త, పాత్రికేయులు కొరటాల సత్యనారాయణ శత జయంతి సందర్భంగా ఆదివారం రిమ్స్ ఆస్పత్రిలో రోగులకు జేవీవీ నాయకులు రొట్టెలు పంపిణీ చేశారు. జేవీవీ రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ కొరటాల సత్యనారాయణ పేదల కోసం కృషి చేసిన పాత్రికేయుడని, విలువలు తెలిసిన వ్యక్తి అని కొనియాడారు. పాత్రికేయుల సమస్యల పరిష్కారం కోసం జీవితాంతం కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సమీర్ బాషా, వెంకటేశ్వర్లు, నారాయణ, మనోహర్, బాలకృష్ణ, బాషా, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

మొల్లమాంబ శతకం ఆవిష్కరణ

కడప కల్చరల్: మహా కవయిత్రి మొల్లమాంబ ఖ్యాతి మహిళా లోకానికి ఆదర్శమని విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు అన్నారు. మొల్ల సాహితీ పీఠం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని కోటిరెడ్డి సర్కిల్‌లోని మొల్లమాంబ విగ్రహం వద్ద రచయిత మామిళ్ల లోకనాథం రచించిన శతకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొల్లమాంబ జయంతిని ఏటా మార్చి 13న రాష్ట్ర ప్రభుత్వం పండుగగా నిర్ణయించడంతో ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం గానుగపెంట హనుమంతరావును సాహితీ వేత్తలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రౌన్ భాషా కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, స్వర్ణలత, వై సంజీవరాయుడు, రారాజు, కాల్వ సోము కళానాథరెడ్డి, పార్వతమ్మ, శివ శంకర్, కొండారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యాలీతోపాటు కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఫౌండేషన్ అడ్మిషన్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ చదివి ఉండాలని, 18–26 సంవత్సరాలమధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఇతర వివరాలకు 90004 87423 నంబరులో సంపదించాలన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి నేతలు జీవన్ చంద్రశేఖర్, కృష్ణకుమార్ కోరారు. జిల్లా రెవెన్యూ అసోసియేషన్ సమావేశ మందిరంలో ఆదివారం జిల్లా స్థాయి ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మహాజన సభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి తక్కువ వేతనానికి సమయ పాలన లేకుండా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో జేఏసీని బలోపేతం చేసుకుని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. కార్యక్రమంలో తులసీనాథ్, పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఎంపిక : కడప జిల్లా ఒప్పంద మరియు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా చైర్మన్‌గా తులసీనాథ్(గృహ నిర్మాణ శాఖ), ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్ (సాంఘిక సంక్షేమ శాఖ), అసోసియేట్ చైర్మన్‌గా గణేష్ (హార్టికల్చర్), కో చైర్మన్‌గా వరప్రుత్ర (మెడికల్ డిపార్టుమెంట్)లను ఎన్నుకున్నారు.

కైఫీయత్‌లు సామాజిక అంశాలకు దర్పణం



వక్త లక్ష్మయ్యను సత్కరిస్తున్న బ్రౌన్ గ్రంథాలయ ప్రతినిధులు

కడప కల్చరల్ : కై ఫియత్‌లు రెండు దశాబ్దాల సామాజిక అంశాలకు దర్పణాలు అని తెలుగు అధ్యాపకుడు డాక్టర్ ఎం.లక్ష్మయ్య పేర్కొన్నారు. స్థానిక బ్రౌన్ శాస్త్రి సమావేశ మందిరంలో 'నెలనెలా సీమ సాహిత్యం'పై 124వ సదస్సు యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ఆదివారం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల జీవన విధానం, సంస్కృతి సంప్రదాయాలు, విశ్వాసాలు, పంటలు, నీటి వనరులు, ఇతర సామాజిక అంశాలను కై ఫీయత్‌లు తెలుపుతున్నాయన్నారు. కడపజిల్లా కైఫియత్తులను 1810 నుండి 1812 మధ్య ప్రాంతంలో రాయించినట్లు ఆధారాలున్నాయన్నారు. వక్త డాక్టర్ లక్ష్మయ్యను యోగి వేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, సహాయ పరిశోధకులు డా.భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథపాలకులు ఎస్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక కలసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహా మండలి సభ్యులు జానమద్ది విజయ భాస్కర్, గ్రంథపాలకులు జి.హరిభూషణ రావు, కొత్తపల్లె రామాంజనేయులు, రాజారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, మొగిలిచెండు సురేష్, గురివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నేరానికి పాల్పడ్డారు



మాట్లాడుతున్న మహమ్మద్ అలీఖాన్

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాజ్యాంగ నేరానికి పాల్పడ్డారని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ ఆరోపించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో సభ్యులకు ప్రధాని రాజ్యాంగ పుస్తకాలు అందించారన్నారు. వాటిలో సోషలిస్ట్, సెక్యులరిజం భాగాలను తొలగించి ప్రధాని రాజ్యాంగ నేరానికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఆయనపై చట్టపరమైన చర్యలు వెంటనే చేపట్టాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జాతీయ మైనార్టీ కమిషన్ చైర్మన్‌లకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు గుణపాఠం నేర్పుతారని విమర్శించారు. ఈ సమావేశంలో నూకల చిన్న కుళ్లాయప్ప, ఎం.రహమతుల్లాఖాన్, తదితరులు పాల్గొన్నారు.

విరిగిపడిన విద్యుత్ స్తంభం



ఇంటిపై విరిగి పడిన విద్యుత్ స్తంభం

కమలాపురం : పట్టణంలోని తాళింవీధి వద్ద ఆదివారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షానికి పురాతన విద్యుత్ స్తంభం విరిగి ఎదురుగా ఉన్న ఇంటిపై పడింది. సంఘటన తెల్లవారక ముందే జరగడంతో ఆ దారిన ఎవరూ తిరగక పోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. విద్యుత్ స్తంభం ఇంటిపై పడటంతో గేటు నుంచి గోడలకు విద్యుత్ సరఫరా కావడంతో ఇంటి యజమాని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సిబ్బంది అక్కడికి చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం విద్యుత్ స్తంభాన్ని తొలగించారు.

రూ. 55 లక్షలతో గ్రేడింగ్ మిషన్ ఏర్పాటు



పులివెందుల వ్యవసాయ మార్కెట్‌లో సిద్ధంగా ఉంచిన గ్రేడింగ్ మిషన్

పులివెందుల రూరల్ : స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సుమారు రూ.55 లక్షలతో చీనీకాయలను గ్రేడింగ్ చేసుకునేందుకు గ్రేడింగ్ మిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ గ్రేడింగ్ మిషన్ నాలుగు సైజుల్లో గ్రేడింగ్ చేస్తుందని వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, సెక్రటరీ రత్నరాజులు తెలిపారు. గంటకు 3 టన్నుల చీనీకాయలను ఈ మిషన్ ద్వారా గ్రేడింగ్ చేసుకోవచ్చన్నారు. గ్రేడింగ్ మిషన్ పులివెందుల వ్యవసాయ మార్కెట్‌లో అందుబాటులో ఉంటుందని, రైతులు చీనీకాయలను ఉచితంగా గ్రేడింగ్, క్లీనింగ్ చేసుకోవచ్చని వారు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కృత్రిమ అవయవాల పంపిణీ



కృత్రిమ కాలు అమర్చుతున్న యువకుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వెంకటేశ్వర్లపేట సరస్వతి విద్యా మందిరంలోని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం 70 మందికి కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ వెంకట్రామ్, డాక్టర్ ఎం.రమేష్ మాట్లాడుతూ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, హుబ్లీలోని ఆల్ ఇండియా జైన్ యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలను అందించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మానవతా చైర్ పర్సన్ కళావతి, గౌరవాధ్యక్షుడు సన్నుతి శ్రీనివాసులు, అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, ప్రకాష్, రమేష్, సుబ్రహ్మణ్యం, వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్ర వ్యాప్తంగా ఆశా కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణు గోపాల్ డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలతో 24 గంటలు సర్వేలు చేయించుకుంటూ తగిన భత్యం ఇవ్వకపోవడం తగదన్నారు. హెల్త్ కార్డుల సర్వేని నిర్వహించకుంటే జీతాలు నిలిపివేస్తామని హెచ్చరించడం దారుణమన్నారు. ఆశా కార్యకర్తలకు 15వేల వేతనం, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సుభాషిణి, చంద్రశేఖర్, కల్పన పాల్గొన్నారు.

డిసెంబర్ 23, 24వ తేదీలలో సాహిత్య సభలు

కడప కల్చరల్: వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ 23, 24వ తేదీలలో మహా సభలు నిర్వహించనున్నట్లు అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి తెలిపారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం వైయస్ఆర్ జిల్లా రచయితల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహా సభల్లో నిర్వహించాల్సిన కార్యక్రమాల గురించి చర్చించారు. తొలి రోజు కార్యక్రమంలో ప్రాచీన సాహిత్యం, కవిత, కథానిక, నవల, నాటకం ప్రక్రియలపై సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాల్లో భువన విజయం నాటక ప్రదర్శన, రెండవరోజు కార్యక్రమంలో అవధానం, హాస్యావధానం, కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ సమావేశంలో సంఘంలోని సీనియర్ సాహితీవేత్తలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, భూమిరెడ్డి స్వరూప రాణి, డాక్టర్ కొప్పోలు రెడ్డిశేఖర్‌రెడ్డి, డాక్టర్ జి.వి.సాయిప్రసాద్, డాక్టర్ అనుగూరు చంద్రశేఖర రెడ్డి, డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి పాల్గొన్నారు.

నేటి నుంచి ఉరుసు

సిద్దవటం : మండల కేంద్రంలోని ఎగువపేటలో చారిత్రాత్మకమైన అస్తాన-ఏ- ఫత్తుమియ్యా దర్గాలో మిలాద్-ఉన్-నబీ సందర్భంగా సోమవారం నుంచి ఉరుసు నిర్వహించనున్నట్లు ముతవల్లి సయ్యద్ అబ్దుల్ అజీజ్ ఖాద్రి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం గంధంను ఆసారే షరీఫ్ ఇంటి వద్ద నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా మసీద్ చేరుతుందన్నారు. అక్కడ గంధంను ఫతేహా నిర్వహిస్తారన్నారు. మంగళవారం ఉరుసు సందర్భంగా మహమ్మద్ ప్రవక్త వస్తువులను ప్రదర్శిస్తారన్నారు. గంధం, ఉరుసు జరుగు రెండు రోజులు అన్నదాన కార్యక్రమం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉరుసును భక్తులు జయప్రదం చేయాలని ఆయన తెలియజేశారు.

బుద్ధుని భావజాలం చారిత్రక అవసరం



మాట్లాడుతున్న బౌద్ధ ప్రచారకులు బొర్రా గోవర్ధన్, చిత్రంలో సాంబశివరావు

కడప కల్చరల్: దేశానికి ప్రత్యామ్నాయ భావజాలం అవసరమని బౌద్ధ ప్రచారకులు బొర్రా గోవర్ధన్ పేర్కొన్నారు. కడప నగరంలోని మానస ఇన్ సమావేశ మందిరంలో బుద్దిస్ట్ కల్చర్ సొసైటీ ఆధ్వర్యంలో భారతీయ తాత్విక చింతనపై ఆదివారం సదస్సు నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ రాజా వెంగళరెడ్డి, ఇంటాక్ చాప్టర్ జిల్లా కన్వీనర్ కె.చిన్నపరెడ్డి ప్రారంభించారు. ప్రధాన వక్త గోవర్ధన్ మాట్లాడుతూ ప్రాచీన కాలంలో మధ్య ఆసియా నుండి వచ్చిన ఆర్యుల్లో తాత్విక దృక్పథం కనిపించదని, లోకాన్ని, మానవ సృష్టికర్త దేవుడని అబద్ధ ప్రచారం చేశారన్నారు. బుద్దిస్ట్ సాంబశివ రావు మాట్లాడుతూ మనిషిని మనిషిగా చూడాలని బుద్ధుని తత్వం తెలియజేస్తుందని తెలిపారు. బౌద్ధం మానవాళికి స్వేచ్ఛ, సమానత్వాలను బోధించిందన్నారు. బుద్దిస్ట్ భార్గవ్ మాట్లాడుతూ విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాలు అభివృద్ధి చెందినా స్వార్థం కోసం మూఢనమ్మకాలను ప్రచారం చేశారన్నారు. డాక్టర్ సి.ఓబుల్ రెడ్డి, కథా రచయిత దాదా హయాత్, బుద్దిస్ట్ కల్చర్ సొసైటీ అధ్యక్షుడు కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి లెనిన్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు మల్లెల భాస్కర్, , సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, సంపత్‌కుమార్, ఎఆర్‌వీ ప్రసాద్, రవిశంకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, శివరాం, శివారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

11వ పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న మేకల శివార్జున

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శివార్జున డిమాండ్ చేశారు. కడప ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ డీఏలను చెల్లించలేదన్నారు. మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపులో జాప్యం ఉందని, సంపాదిత సెలవులు నగదు రూపేణా తీసుకోవడానికి పెట్టిన బిల్లులు ఇవ్వలేదన్నారు. బదిలీల ద్వారా వెళ్లిన ఉపాధ్యాయులకు మ్యాపింగ్ గాక జూన్ నుంచి ఇంతవరకు జీతాలు అందలేదన్నారు. పలుమార్లు సమాచారం అందించినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అలాగే 11వ పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్‌బాబు, గంగరాజు, కార్యదర్శులు గంగాధర్, జయరాముడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీ ఎస్టీఎఫ్ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీపిఎస్ బిల్లును ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని పాత ఫించన్ అమలు కోరుకుంటున్నారని ఏపీ ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. కడప కలెక్టరేట్ వద్ద ప్లకార్డులతో ఆదివారం నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, చత్తీస్గడ్ రాష్ట్రాలు ఓపీఎస్‌ను అమలు చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో జీపీఎస్‌ను కాకుండా ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల జీతం నుంచి ఎటువంటి కాంట్రిబ్యూషన్ లేని ఫించన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఎస్టీఎఫ్ జిల్లా గౌరవ, ప్రధాన కార్యదర్శులు ఆవుల శ్రీనివాసులు, రామచంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారమే ఓపీఎస్ అమలు చేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, జిల్లా గౌరవ సలహాదారు జూన్‌సార్, జిల్లా కార్యదర్శులు చంద్రశేఖర్, నాగరాజు, సలాం, సాగర్‌లతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహించిన వాగులు, వంకలు



లింగాల : వెలిదండ్ల సమీపంలో భారీగా ప్రవహిస్తున్న వంక



లింగాల : చెర్లోపల్లె గ్రామంలో పంట పొలాలలో నిలిచిన నీరు

పెండ్లిమర్రి : మండలంలో ఆదివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కుంటలు, చెరువులు జలకళలను సంతరించుకున్నాయి. సాగులో ఉన్న చామంతి, అరటి పత్తి, వరి పంటలకు ఊరట లభించిందని రైతున్నలు తెలిపారు. ఉల్లి రైతులు కొందరు నష్టపోయిరు. తిప్పరాజుపల్లె గ్రామానికి వెళ్లె దారిలో వాగు ఉధృతంగా ప్రవహించింది. వాగులో ట్రాక్టర్, అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు కూలీలు చిక్కుకున్నారు. స్థానికులు గమనించి కూలీలను, ట్రాక్టర్‌ను బయటకు తీశారు. మధ్యాహ్నం వరకు గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి.

లింగాలలో కోతకు గురైన రోడ్లు

లింగాల : మండలంలో ఆదివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా 59.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు తహసీల్దార్ కార్యాలయంలోని రెయిన్‌ఫాల్ ద్వారా రికార్డు అయింది. భారీ వర్షం కురవడంతో లింగాల నుంచి బోనాలకు వెళ్లే ప్రధాన రహదారి కల్వర్ట్ వద్ద కోతకు గురైంది. వెలిదండ్ల నుంచి సింహాద్రిపురం వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న వంక పొంగిప్రవహించడంతో రాకపోకలు స్థంభించిపోయాయి. కె.చెర్లోపల్లె గ్రామంలో అరటి పొలాల్లో భారీగా వరదనీరు చేరాయి.

దీంతో అరటి పంటలు దెబ్బతింటాయని రైతులు వాపోతున్నారు. వరదనీరు వంకలకు, వాగులకు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో పంట పొలాలు నీట మునుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతకు వచ్చిన టమాట పంటలు కూడా దెబ్బతిన్నాయి.